





పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం సెల్యూట్ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఉన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ

టీసీఎస్ ద్వారా 12 వేల మందికి, కాగ్నిజెంట్ ద్వారా ఎనిమిది వేల మందికి ఉద్యోగాలు



ఆఫర్ లెటర్‌ను సీఎం ఫొటో ద్వారా విద్యార్థికి అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో కలెక్టర్, సీపీ, జేసీ ఉన్నారు.

- గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటైతే నగరానికి మరిన్ని ఐటీ కంపెనీలు
- సూపర్ సిక్స్ కాదు సూపర్ 12 పథకాలు అమలు చేశాం
- స్త్రీశక్తి పథకం ద్వారా బస్సుల్లో రోజుకు 2.26 లక్షల మంది ఉచిత ప్రయాణం
- 2,30,496 మందికి తల్లికి వందనం
- చేపల వేట నిషేధ కాలంలో 12,138 మంది మత్స్యకారులకు భృతి కింద రూ.20 వేల వంతున చెల్లింపు



ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

- ఎన్టీఆర్ వైద్యసేవ కింద 90,748 మందికి ఉచితంగా వైద్యం
- రూ.1,405 కోట్లతో జీవీఎంసీలో వివిధ అభివృద్ధి పనులు
- నగరంలో కొత్తగా 10,805 దీపాల ఏర్పాటుకు రూ.6.52 కోట్లు వ్యయం
- స్వాతంత్ర్య దినోత్సవంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బైక్‌లపై ప్రదర్శన



ప్రథమ బహుమతి పొందిన గృహ నిర్మాణ శాఖ శకటం

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): **జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. విశాఖను ఐటీ హబ్‌గా, డేటాగా తీర్చిదిద్దుతామన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికాలంలో విశాఖకు భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆరు బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ ఏర్పాటుచేయనున్న డేటా సెంటర్‌తో విశాఖకు మరికొన్ని ఐటీ కంపెనీలు రానున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం మేరకు టీసీఎస్ సంస్థ రూ. 1,370 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా 12 వేల మందికి, కాగ్నిజెంట్ రూ.1,583 కోట్ల పెట్టుబడితో ఎనిమిది వేల మందికి, సత్వా గ్రూపు రూ.1500 కోట్లతో 25 వేల మందికి, ఏఎన్ఎస్ఆర్ గ్రూపు రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టి పది వేల మందికి ఉపాధి కల్పించనున్నాయని వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో రూ. 1.35 లక్షల కోట్లతో ఆర్సెల్లార్ మిట్టల్, నిస్సాన్ నెలకొల్పనున్న ఉక్కు కర్మాగారంలో 55 వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

గత ఏడాది ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికే 12 పథకాలు అమలు చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్టు చెప్పారు. గడచిన ఏడాది కాలంలో 10 లక్షల కోట్లు పెట్టుబడులు రావడం ద్వారా 10 లక్షలమందికి ఉపాధి అవకాశాలు వస్తున్నాయని అన్నారు. శుక్రవారం నుంచి అమలులోకి రానున్న స్త్రీశక్తి పథకం ద్వారా జిల్లాలో ప్రతిరోజు 579 బస్సుల ద్వారా 2,26,851 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయనున్నారని మంత్రి తెలిపారు. దీపం-2 కింద ... మిగతా 6వ పేజీలో

నాలా... రాబట్టేదెలా?

బకాయిదారులపై రెవెన్యూ కన్ను

- జిల్లాలో రావలసింది రూ.150 కోట్లు
- ఒక్క గాజువాక ప్రాంతంలోనే రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు
- అందరికీ నోటీసులు జారీ
- మాజీ ఎంపీకి రూ.7.4 కోట్లు కట్టాల్సిందిగా నోటీస్
- ఆర్ఆర్ చట్టం అమలుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు

విశాఖపట్నం/గాజువాక, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో నాలా పన్ను బకాయిలు భారీగా ఉన్నాయి. మొత్తం రూ.150 కోట్లు ఉండగా, అందులో ఒక్క గాజువాక మండలంలోనే సుమారు రూ. 60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకూ పేరుకుపోయాయి. గత ప్రభుత్వంలో నాలా పన్ను బకాయిదారులకు నోటీసులు ఇచ్చారు. కానీ వసూళ్లపై అధికారులు శ్రద్ధ చూపలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ఏడాది నాలా పన్ను బకాయిదారులకు తిరిగి నోటీసులు ఇచ్చారు. అయినా పెద్దగా స్పందన లేకపోవడంతో రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆర్ఆర్ చట్టం అమలు చేయాల్సింది మండల తహశీల్దార్లే అయినా అందుకు అనుమతి ఇవ్వాల్సింది మాత్రం కలెక్టరే. సుమారు నెల రోజుల క్రితం కలెక్టర్ అనుమతి కోసం రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పెట్టారు.**

రెవెన్యూ చట్టంలో ఉన్న నిబంధనల మేరకు వ్యవసాయ భూమిని పారిశ్రామిక, గృహ అవసరాలకు వినియోగిస్తే భూ వినియోగ మార్పిడి కింద నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్) పన్ను చెల్లించాలి. ఆయా ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుని ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నాలా పన్ను చెల్లించిన తరువాత స్థానిక సంస్థలు (జీవీఎంసీ, గ్రామ పంచాయతీలు) ఇళ్ల నిర్మాణాలను ప్లాన్ అనుమతులు ఇస్తుంటాయి. కానీ జిల్లాలో పలుచోట్ల రియల్టర్లు, బిల్డర్లు, వ్యాపార సంస్థలు స్థానికంగా ఉండే అధికారులను పలు రకాలుగా ప్రలోభాలకు గురిచేసి ప్లాన్ అనుమతులు తీసుకుంటున్నారు. నాలా పన్ను చెల్లించకుండా నిర్మాణాలు జరిగితే వెంటనే నిలిపివేయాల్సిన రెవెన్యూ శాఖ కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది.

మాజీ ఎంపీ కూర్మన్నపాలెంలో నిర్మించిన భారీ బహుళ అంతస్థుల భవనాలకు సంబంధించి రూ.3.7 కోట్ల మేర నాలా పన్ను చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించకుండానే గత ప్రభుత్వంలో జీవీఎంసీ నుంచి ప్లాన్‌కు అనుమతులు తీసుకున్నారు. ముందస్తుగా నాలా పన్ను చెల్లించకుండా నిర్మాణాలు చేపట్టడంతో 100 శాతం అపరాధ రుసుముతో కలిపి రూ.7.4 కోట్లు చెల్లించాలని నాలుగేళ్ల క్రితమే నోటీస్ జారీచేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో ఆయన పట్టించుకోలేదు. ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఎంవీవీ బిల్డర్స్ నుంచి నాలా పన్ను వసూలు చేయడంలో రెవెన్యూ శాఖ విఫలమైందనే వాదన వినిపిస్తోంది. నాలా పన్ను గురించి ఒత్తిడి చేయొద్దని కూటమి పార్టీలకు చెందిన కొందరు నేతలు అడ్డుపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా షీలానగర్‌లో ఎస్టీబీఎల్ సంస్థ సుమారు రూ.మూడు కోట్ల వరకు నాలా పన్ను చెల్లించాలి. పన్ను చెల్లించకపోవడంతో సినిమా థియేటర్లకు లైసెన్స్‌ల పునరుద్ధరణను రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఇంకా గాజువాకలో చాలా మంది బిల్డర్లు రూ.కోటి నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు నాలా పన్ను చెల్లించాల్సి ఉందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. అగనంపూడిలో కొత్తగా ప్రారంభించిన కావ్య ఎంటర్‌ప్రైజస్ కూడా రూ.కోటి వరకూ నాలా పన్ను చెల్లించాలి. కాగా బిల్డర్స్ అసోసియేషన్ నాలా పన్ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతోంది. అందుకే పన్ను చెల్లింపుపై కొందరు బిల్డర్లు సందిగ్ధంలో ఉన్నారు. అయితే కొత్తగా చట్టం వస్తే...అప్పటి నుంచి నాలా పన్ను రద్దు అవుతుంది తప్ప గతంలో బకాయిలకు వర్తించదని రెవెన్యూ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

హ్యాపీ జర్నీ

మహిళలకు ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం

- 74 శాతం బస్సుల్లో ఉచితం: రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- 5 రకాల బస్సుల్లో అవకాశం
- ఎక్కడినుంచి ఎక్కడికైనా, ఎంత దూరమైనా ప్రయాణం చేయవచ్చు
- జిల్లాలో అట్టహాసంగా 'స్త్రీశక్తి' పథకం ప్రారంభం



ఉచిత ప్రయాణం బస్సుల వద్ద మహిళల సెల్ఫీ



స్త్రీశక్తి పథకం ప్రారంభించిన అనంతరం మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు 'స్త్రీశక్తి' పథకం కింద ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఆయన శుక్రవారం సాయంత్రం మద్దిలపాలెం ఆర్టీసీ బస్సు డిపోలో 'స్త్రీశక్తి' పథకాన్ని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో కలిసి ప్రారంభించారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్టీసీ వద్ద 10,187 బస్సులు ఉంటే వాటిలో 74 శాతం బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల కంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో ఈ పథకం కోసం ఆర్టీసీ అధికారులు 576 బస్సులు సిద్ధం చేశారన్నారు. ఉపాధి కోసం బయటకు వచ్చే మహిళలకు ఇప్పుడు రవాణా ఖర్చులు మిగులుతాయన్నారు. మేయరు పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉచిత బస్సు ... మిగతా 6వ పేజీలో

ఘాట్‌రోడ్లలో కూడా గ్రీన్ సిగ్నల్

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్లలో రాకపోకలు సాగించే బస్సుల్లో కూడా స్త్రీశక్తి పథకం వర్తింపజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. వెనువెంటనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్టీసీ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. శనివారం మొదటి షెడ్యూల్ నుంచి దీనిని అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఘాట్‌రోడ్డులో ప్రయాణించే బస్సుల్లో సీటింగ్ కెపాసిటీ వరకూ మాత్రమే ప్రయాణికులను అనుమతించాలని, అంతకు మించి డిమాండ్ ఉంటే అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించింది. విశాఖ రీజియన్‌లో సింహాచలం, యారాడ, కైలాసగిరి రూట్లలో ఘాట్ రోడ్లు ఉన్నాయి. ఇంకా విశాఖ నుంచి పాడేరు, అరకు, భద్రాచలం వెళ్లే రూట్‌లలో కూడా ఘాట్ రోడ్లు ఉన్నాయి. ఈ రూట్లలోకూ స్త్రీశక్తి పథకం వర్తిస్తుంది. ఈ రూట్‌లో రాకపోకలు సాగించే మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ వెల్లడించారు.

రోజుకు రూ.120 ఆదా



ఆరిలోవ నుంచి పని కోసం మద్దిలపాలెం రావాలంటే ఆటోకు రూ.40 అవుతుంది. తిరిగి వెళ్లడానికి మరో రూ.40...రోజుకు రూ.80 ప్రయాణానికే ఖర్చవుతుంది. ఇతర ప్రాంతాలకువెళ్లాలంటే మరో నలభై, యాభై రూపాయలు అదనంగా అవుతోంది. బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం వల్ల రోజుకు 120 నుంచి 140 రూపాయలు ఆదా అవుతాయి.

\- ఎం.లక్ష్మీ, ఆరిలోవ

నెలకు రూ.3 వేలు మిగులు




మద్దిలపాలెంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నా. కైలాసపురం నుంచి రోజు వచ్చి, వెళ్లడానికి రూ. 80 వరకూ ఖర్చవుతుంది. సెలవు రోజుల్లో కూడా ఏదో పనిపై బయటకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణాలకు నెలకు దాదాపు రూ.3 వేలు పైగా అవుతుంది. ఇప్పుడు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో ఆ మొత్తం పిల్లల చదువుకు పెట్టవచ్చు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు నెలకు మూడు, నాలుగు వేల రూపాయలు ఆదా చేసుకునే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- వి.భువనేశ్వరి, కైలాసపురం

మహిళలకు ఎంతో లబ్ధి

\- జల్లి సత్యవతి, తిరుమలనగర్, గాజువాక



మహిళలు పలువురు అపెరల్ పార్కు, వీఎస్ ఈజెడ్, పలు ఫార్మా కంపెనీల్లో దినసరి కూలీలుగా పనిచేస్తూ నిత్యం బస్సుల్లో, ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు రానుపోను సగటున 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. చార్జీల రూపంలో రూ.100 ఖర్చవుతుంది. స్త్రీశక్తి పథకం ప్రారంభంతో ఆ డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంది. సాధారణ మహిళలకు కూడా ఈ పథకంతో ఎంతో లబ్ధి చేకూరుతుంది.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాలు ప్రారంభం



సాగర్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మూడు రోజులు పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయి సేవనిలు తెలిపారు.

సముద్ర గర్భంలో జాతీయ జెండా



సాగర్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో స్కూబా డైవర్లు స్వాతంత్ర్య దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఇద్దరు స్కూబా డైవర్లు రుషికొండ బీచ్ వద్ద సముద్రం గర్భంలోకి జాతీయ జెండాను తీసుకువెళ్లి 15 నిమిషాల పాటు రెపరెపలాడించారు. అనంతరం జాతీయ పతాకానికి వందనం చేశారు.


ఎండాడలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శకటం ర్యాలీ


భీమిలి జోనల్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న జడ్పీ అయ్యప్పనాయుడు


రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

వాడవాడలా జెండా పండుగ

- నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు, అధికారులు

భీమునిపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ 79వ స్వాతంత్ర్య దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి జోనల్ కార్యాలయంలో జడ్పీ అయ్యప్ప నాయుడు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలం వల్ల సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ అప్పలకొండ, టీడీపీ నాయకుడు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు జాతీయ జెండాను ఎగురవేయగా ఈవోఆర్డీ కె. రమేశ్‌నాయుడు, ఎంఈవో శివ రాణి, ఏఈ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. భీమిలి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో సంగీత్ మాథూర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి 4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మూలకుద్దు సర్పంచ్‌ను, దివీస్ యాజమాన్యాన్ని ఆయన అభినందించి, సన్మానించారు. అలాగే విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ హర్షవర్ధన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భీమిలి పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ రాధాకృష్ణ, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పీవో శ్రీదేవి జాతీయ పతాకాన్ని ఎగురవేసారు.ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, జీవీఎంసీ పాఠశాలల్లోనూ వేడుకలు నిర్వహించారు. బీచ్‌రోడ్‌లో వున్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, గంటా అప్పలకొండ, నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, కొప్పల రమేశ్, కురిమిన లీలావతి, యరబాల అనిల్ ప్రసాద్, మారోజు సంజీవ్ కుమార్ పాల్గొన్నారు. చిన్నబజారు డచ్‌రోడ్‌లో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు దుస్తులు, బాలురకు రగ్గులు పంపిణీ చేశారు. పాతబస్టాండ్ వద్ద నూకాంబికా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీఐటీయూ నాయకులు అప్పల నాయుడు,నేరేళ్లవలస పాఠశాలలో జరిగిన వేడుకల్లో సీపీఎం నాయకుడు రమణ, వైసీపీ నాయకుడు జగన్నాథ అప్పారావు పాల్గొన్నారు. ది సన్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఎనిమిదో వార్డులో...

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఎన్‌సీసీ విద్యార్థులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గొల్లల ఎండాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కూడా వేడుకలు జరిగాయి. ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు దేశ ప్రగతిని వివరిస్తూ శకటాన్ని రూపొందించి వీధుల్లో ర్యాలీ చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపీ, శాఖరీ శ్రీనివాస్ పాల్గొన్నారు. పనోరమ హిల్స్‌లో ఉన్న సెలబ్రిటీ టవర్స్‌లో కూడా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పల్లా ఆనంద్, సభ్యులు ఉమామహేశ్వరావు, డి. మహేశ్, డీవీ రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

తగరపువలస, చిట్టివలసలో..

తగరపువలస : తగరపువలస, చిట్టివలసలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దుర్గా భవానీ ఆటో స్టాండ్ వద్ద 2వ వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు శివారెడ్డి, ఎర్రిబాబు, తదితరులు పాల్గొన్నారు. చిట్టివలస, సంతపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం జగన్నాథస్వామి, సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులు కె. రాంబాబు, అప్పలరాజు, చిల్ల నరసింహులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బంగ్లామెట్ట కమ్యూనిటీ హాలు వద్ద ఎస్సీ సెల్ ఆధ్వర్యంలోనూ, నమ్మివానిపేట, చిల్లపేట, ఎడదాసరిపేట, సంగివలస, వలందపేటలో కూడా వేడకలు ఘనంగా జరిగాయి.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లోనూ వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక జాతీయ జెండాను ఆవిష్కరించగా, నాయకులు మజ్జి వెంకటరావు, ఎంపీడీవో జానకి, తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, హెచ్ఎం కామేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చందక సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొట్యాడ రెడ్డిబాబు, మీసాల సత్యన్నారాయణ, కుప్ప రామలక్ష్మి పాల్గొన్నారు. పోలీసు స్టేషన్‌లో సీఐ చింతా వాసునాయుడు పతాకావిష్కరణ జరిపారు. గొట్టిపల్లి, చందక, కుసులువాడ, గిడిజాల, గండిగుండం, రామవరం, మామిడిలోవ, శొంఠ్యాం తదితర పంచాయతీల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.


భీమిలిలో త్రివర్ణాలతో అలంకరించిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఐదో వార్డులో..

కొమ్మాది : జోన్ 2 కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో జడ్పీ కనకమహాలక్ష్మి, 5వ వార్డులోని పలు చోట్ల జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత, పీఎంపాలెం ప్రభుత్వ పాఠశాలలో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్ పతాకావిష్కరణ జరిపారు. అలాగే చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ అచ్చుతరావు, బాహుజీ కళా మందిరం వద్ద చంద్రంపాలెం గ్రామ పెద్దలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

గీతంలో...

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధరరావు, గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ్, ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రొ వీసీ డాక్టర్ బి. గీతాంజలి, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే సాగర్‌నగర్, రుషికొండలోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ విగ్రహం వద్ద 8వ వార్డు కార్పొరేటర్ నొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, చెట్టుపల్లి సన్యాసిరావు, బి.దొరబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సాగర్‌నగర్ గ్రంథాలయం వద్ద సాగర్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి, స్వీట్లు పంచారు. రుషికొండ మెరైన్ పోలీస్‌స్టేషన్, పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దివీస్ ఉద్యోగుల బైక్ ర్యాలీ

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని దివీస్ కంపెనీ ఉద్యోగులు చిప్పాడ నుంచి మూలకుద్దు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కంపెనీ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన యువకులు ర్యాలీలో పాల్గొన్నారు. దేశ సమైఖ్యతను కోరుతూ ర్యాలీ చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సింహాచలంలో..

సింహాచలం : సింహాచలం దేవస్థానం కార్యాలయం వద్ద ఈవో వేంద్ర త్రినాధరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాంస్కృతిక ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో దేవస్థానం మాజీ చైర్మన్ దివంగత పి. ఆనంద గజపతిరాజు జ్ఞాపకార్థం పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని జి. భారతికి రూ. 5 వేలు నగదు బహుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈవో సింగం రాధ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బీసీ గురుకుల పాఠశా లలో ప్రిన్సిపాల్ రమా మోహిణి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజిమెంట్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ పలుచోట్ల త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మధురవాడ పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ పోతిన ప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద డీఈ బి.సింహాచలంనాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు.మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు జాతీయ జెండాను ఎగురవేశారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ జాతీయ పతాకం రెపరెపలాడింది. చిన్నారులు దేశ నాయకుల వేషధారణలతో అలరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రాంబాబు, తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు ఆనందరావు, పోలీసు స్టేషన్ వద్ద సీఐ శ్రీధర్, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ జగన్మోహనరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పద్మనాభం జెడ్పీ పాఠశాలలో చైర్మన్ అవనాపు నాగలక్ష్మి, సచివాలయం వద్ద సర్పంచ్ టి. పాప, ఇసకలపాలెం పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ హంస జ్యోతి, రేవిడి పీహెచ్‌సీలో వైద్యాధికారి లీలా ప్రసాద్, బీఆర్ తాళ్లవలస పాఠశాలలో చైర్మన్ పి. వెంకటలక్ష్మి పతాకావిష్కరణ చేశారు. రేవిడి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి నమ్మి అప్పారావు కుర్చీలు, క్యారమ్ బోర్డులు, ఇన్వర్టరు బహూకరించారు.


ఆనందపురం హైస్కూల్‌లో పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీపీ శారదా


సింహాచలం దేవస్థానంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఈఓ వేంద్ర త్రినాథరావు, సిబ్బంది


బీఆర్ తాళ్లవలసలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు, నాయకులు

తాటితూరు పాఠశాలకు కుర్చీలు వితరణ

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు 35 కుర్చీలను వితరణగా అందించారు. వీటి విలువ సుమారు రూ. 15 వేల ఉంటుందని వారు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఆనందపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 - 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 550 మార్కులు వచ్చిన ఆరుగురికి రూ. 10 వేలు చొప్పున, 500 మార్కులు వచ్చిన పది మందికి రూ. 5 వేలు చొప్పున అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

ఆనందపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. హరేకృష్ణ మూవ్మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస ఉదయం 11 గంటలకు బాలగోపాలునికి ఉయ్యాల సేవతో ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు బాల గోపాలుడి ఉయ్యాల ఊపుతూ పరవశించిపోయారు. ఈ సందర్భంగా భక్త దాస మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 108 పలకలతో హరి నామ జప మండపంలో సంకీర్తనలు, మహా అభిషేకం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పద్మనాభం : మండలంలోని మద్దిలో శనివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 11 రోజుల పాటు విగ్రహాన్ని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈనెల 26న విగ్రహాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు.


బాలగోపాలునికి ఉయ్యాల సేవ

హ్యాపీ జర్నీ

... 5వ పేజీ తరువాయి

ప్రయాణం వల్ల మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఇదో వినూత్న పథకమని, కూటమి ప్రభుత్వాన్ని మహిళలు బాగా గుర్తు పెట్టుకోవాలని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడుతున్నా కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నదని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా పేర్కొన్నారు. పథకం మహిళల అభివృద్ధికి దోహదపడుతుందని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు.

మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- భీమిలి ఎమ్మెల్యే గంటా

కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆయన మధురవాడ ఆర్టీసీ డిపోలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి మహిళలతో కలిసి కొంతదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు ఉద్యోగాలు చేసుకునే మహిళలు, గృహిణులకు ఈ పథకం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలన్నీ మొదటి ఏడాదిలోనే నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

గోపాలపట్నంలో...

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్త్రీశక్తి పథకాన్ని గోపాలపట్నంలో ప్రారంభించారు. మహిళలతో కలిసి గాజువాక మీదుగా ములగాడ వరకు ప్రయాణించారు. బస్సులో మహిళలతో ముచ్చటిస్తూ వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

పెందుర్తిలో...

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తి బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెందుర్తి ప్రాంతం నుంచి వివిధ పనులపై నగరంలోకి వెళ్లే మహిళలకు ఈ పథకం బాగా ఉపకరిస్తున్నారు. కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యప్రసాద్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు


డిపో వద్ద సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మహిళలకు వరం... స్త్రీశక్తి పథకం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం మహిళలకు ఒక వరమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మధురవాడ ఆర్టీసీ డిపో వద్ద స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఖర్చుకు వెనుకాడకుండా మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 10187 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. 78 శాతం బస్సుల్లో ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. దీనివల్ల ఏటా ప్రభుత్వం రూ.1942 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. మహిళల సంఖ్య దృష్టిలో ఉంచుకొని భద్రతతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ పథకం అమలుతో సూపర్ సిక్స్‌లో సుమారు అన్ని హామీలు నెరవేర్చినట్టు అయ్యిందన్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే బస్సులు ప్రారంభించిన తరువాత మహిళలతో కలిసి కొంతదూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో 7, 5 వార్డుల కార్పొరేటర్లు పిళ్లా మంగమ్మ, మొల్లి హేమలత, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, కార్పొరేటర్లు చిన్నికుమారి లక్ష్మీ , లొడగల అప్పారావు, ఆర్టీసీ డిపో మేనేజర్ సుధా బిందు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రయోజనకరం..

స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల కొంత ఆర్థికభారం తగ్గుతుంది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడం మహిళలకు ఒక వరమే, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు.


నాగోతి కనకరత్నం

చిరుద్యోగులకు ఊరట

స్త్రీశక్తి పథకం వల్ల చిన్న ఉద్యోగాలు చేసుకునే మహిళలకు ఊరట లభిస్తుంది. రవాణా చార్జీలు కూడా ఆదా అవుతాయి. తక్కువ జీతంతో పనిచేసే మహిళలు గతంలో రవాణా చార్జీలకు ఆదాయంలో 20 శాతం ఖర్చు చేసేవారు. ఇప్పుడు ఖర్చు ఉండదు.


బొడ్డేటి చంద్రకళ

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

7.3 లక్షల మంది మహిళలకు ఉచిత సిలిండర్లు అందించడం కోసం రూ. 59.32 కోట్లు జమ చేశామన్నారు. పేద పిల్లల చదువు కోసం తల్లికి వందనం పేరిట జిల్లాలో 2,30,496 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.299 కోట్లు జమ చేశామని మంత్రి తెలిపారు. 776 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద 18 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.12.9 కోట్లు జమ చేశామన్నారు. చేపల వేట నిషేధ కాలంలో భృతి కింద 12,138 మంది మత్స్యకారులకు రూ.20 వేల వంతున చెల్లించామన్నారు. జిల్లాలో 4,604 హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాల కింద రూ.38 లక్షలు కేటాయించామన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి 25,063 కుటుంబాలలో 34,075 మందికి 12 లక్షల పనిదినాలు కల్పించి రూ.33.14 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. విశాఖ పోర్టు సాయంతో పొలం గట్లు, చెరువు గట్లపై 12,946 మొక్కలు నాటడం జరిగిందన్నారు. వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్ అమలు కోసం భీమిలి-నర్సీపట్నం రోడ్‌కు సంబంధించి జిల్లా పరిధిలో విస్తరణకు రూ.34 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఇంతవరకు 90,748 మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలకు రూ.158.49 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనకు 2.44 లక్షల కుటుంబాల్లో 9.11 లక్షల మంది అర్హత పొందారన్నారు. జీవీఎంసీ పరిధిలో రూ.1,405 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు వివిధ పనులు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అమృత్ 2.0లో భాగంగా మంచినీటి సరఫరా మెరుగుకు రూ.360.77 కోట్లతో 27 ప్రాజెక్టులు చేపట్టగా ఇప్పటివరకూ ఐదు పూర్తయ్యాయన్నారు. నగరంలో 1.18 లక్షల ఎల్‌ఈడీ వీధిదీపాలు ఉండగా కొత్తగా 10,805 దీపాల ఏర్పాటుకు రూ.6.52 కోట్లు వెచ్చించామన్నారు. నగరంలో 740 ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసేందుకు రూ.56 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. 25 అన్న క్యాంటీన్లలో రూ.3.33 కోట్లు వెచ్చించి 64 లక్షల మందికి భోజనం అందించామన్నారు. వీఎంఆర్డీఏ ద్వారా రూ.17.73 కోట్లతో పెందుర్తిలో రెండు కన్వెన్షన్ సెంటర్లు, సిరిపురంలో రూ.87.5 కోట్లతో మల్టీలెవెల్ పార్కింగ్, రూ.3.49 కోట్లతో వాణిజ్య సముదాయాలు నిర్మించామన్నారు. కైలాసగిరిపై జిప్ లైనర్, స్కై సైక్లింగ్, గ్లాస్ బ్రిడ్జి ఇతర ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఎకో హైట్స్ కాటేజెస్, రివ్వాలింగ్ రెస్టారెంట్, ఇతర ప్రాజెక్టుల పనులు రూ.20 కోట్లతో జరుగుతున్నాయన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కులో రూ.7.8 కోట్లతో అల్లూరి సీతారామరాజు సెంటినరీ మెమోరియల్ మాన్యుమెంట్ బీచ్ డెక్ రూపొందించనున్నామన్నారు. జిల్లాలో పేదల కోసం 1.39 లక్షల ఇళ్లు మంజూరుచేయగా, ఇప్పటివరకూ 49 వేల ఇళ్లు పూర్తిచేశామన్నారు. సీఎం సూర్యఘర్ కింద 2,460 సోలార్ రూఫ్‌టాప్ ప్యానళ్ల పనులు పూర్తిచేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. రూ.16,219 కోట్ల పెట్టుబడులతో మూడు భారీ పరిశ్రమల ఏర్పాటు చేయడం ద్వారా 34,120 మందికి, రూ.244 కోట్లతో 7,371 చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించడం ద్వారా 13,637 మందికి ఉపాధి కలిగిందన్నారు. 54 జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా 4,734 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇంకా తొమ్మిది స్కిల్ హబ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, దీంట్లో 562 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. మూడు లక్షల మందితో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో నమోదుకావడం జిల్లాకు గర్వకారణమన్నారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు త్వరలో పట్టాలెక్కనున్నదని, దీనిలో భాగంగా తొలిదశ పనులు త్వరలో చేపడతామని మంత్రి ప్రకటించారు. మొదటి దశ టెండర్లు ఇప్పటికే పిలిచామని, మూడు కారిడార్లలో 76.9 కిలోమీటర్లకు డీపీఆర్ రూపొందించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చొరవతో విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం రూ.11,440 కోట్లు కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. విభజన హామీలలో భాగంగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటైందన్నారు. జోన్ కార్యాలయం పనులు ప్రారంభమయ్యాయన్నారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకు ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చామన్నారు. భూముల రీసర్వే పనులు 2027 డిసెంబరుకు పూర్తిచేస్తామన్నారు. అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి తప్పులను నిగ్గు తేల్చామన్నారు. వచ్చే ఏడాది జూన్‌కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్నదని మంత్రి ప్రకటించారు. జిల్లాను అభివృద్ధిపథం దిశగా నడిపించేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు, న్యాయాధికారులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

లబ్ధిదారులకు రూ. 214.99 కోట్ల ప్రోత్సాహకాలు అందజేత

గృహ నిర్మాణ శాఖ శకటానికి ప్రథమ, జీవీఎంసీ శకటానికి ద్వితీయ, విద్యా, సమగ్రశిక్షా శకటానికి తృతీయ బహుమతి, ఈపీడీసీఎల్ శకటానికి ప్రోత్సాహక బహుమతి లభించాయి. మైదానంలో పలు శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను మంత్రి, ఇతర అధికారులు సందర్శించారు. వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు రూ.214.99 కోట్ల ప్రోత్సాహకాలను మంత్రి అందజేశారు. సేక్రెడ్ హార్ట్, విశాఖ వ్యాలీ, పద్మనాభం కేజీబీవీ, నడుపూరు, పెందుర్తి జడ్పీ పాఠశాలల విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఏపీ ఆయిల్ సీడ్స్ కో-ఆపరేటివ్ గ్రోయర్స్ చైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీసీపీలు అనిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుక


బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ


రెండో బహుమతి గెలుచుకున్న జీవీఎంసీ శకటం


మూడో స్థానంలో నిలిచిన విద్యాశాఖ శకటం


సాంస్కృతిక ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు


జాతీయ జెండాలతో అభిమాని ప్రదర్శన


వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్


హాజరైన ఎంపీ శ్రీభరత్, మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు


ఎస్‌హెచ్‌జీ మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి


ఉత్తమ సేవలకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీఆర్వో భవానీ శంకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, బీసీ సంక్షేమాధికారి రామారావు, డీఎస్వో వి.భాస్కరరావు, సమగ్ర శిక్ష ఏపీడీ చంద్రశేఖరరావు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీత, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, భీమిలి ఆర్డీవో సంగీత్‌మాథుర్, ఎస్‌డీసీలు సుధాసాగర్, శేషశైలజ, జోన్ 2 జెడ్సీ కనకమహాలక్ష్మి, 108 జిల్లా మేనేజర్ సురేశ్, ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్స్ ప్రతినిధి వర్మ, కలెక్టరేట్ ప్రొటోకాల్ విభాగం డీటీ సుధాకర్ (కుడి నుంచి ఎడమకు)

జీవీఎంసీలో స్వాతంత్ర్య వేడుకలు


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ పీలాశ్రీనివాసరావు, పాల్గొన్న కమిషనర్ కేతన్ గార్గ్, అధికారులు


జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్

వెంకోజీపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేశారు. జీవీఎంసీ సాధించిన ప్రగతిని, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యకలాపాల గురించి వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నగరంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, అమృత్ 2.0 పథకం, వీధి దీపాల నిర్వహణ, నూతన ప్రాజెక్టు పనుల ప్రతిపాదనలు, హార్టికల్చర్ విభాగం, అన్న క్యాంటీన్లు నిర్వహణ, ప్రజారోగ్య విభాగం పనితీరు, జీవీఎంసీ క్రీడలు, 2024లో జీవీఎంసీకి లభించిన అవార్డులు తదితర అంశాలను ప్రస్తావించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. జీవీఎంసీలో ఉత్తమ పనితీరును కనబరిచిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏలో..

విశాఖపట్నం : సిరిపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) :ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగా బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుంచి మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం వీఎంఆర్డీఏ భవన్ ఆవరణలోని 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాడవాడలా స్వాతంత్ర్య సంబరాలు

» కార్యాలయాలు, విద్యాసంస్థలు, కాలనీల్లో సందడిగా పతాకావిష్కరణలు » అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


పెదవాల్తేర్ : బీజేపీ నగర కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న పరశురామ్‌రాజు తదితరులు

వెంకోజీపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం జాతీయ జెండాను ఎగుర వేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల కార్యాలయాలు, కాలనీల్లో జాతీయ పతాకం రెపరెపలాడింది. చిన్నారులు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్ని వర్గాల వారు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

జీఆర్‌నగర్‌లోని కాలనీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాలనీ వాసులు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, బి.పెరుమాళ్లరాజు, జీఎస్ శివప్రకాష్, దేవేంద్ర వర్మ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో వార్డు టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, టీడీపీ ఇతర నాయకులు, స్థానిక వాసులు పాల్గొన్నారు. హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో క్రీడాకారులు, చిన్నారులు జెండా వందనం నిర్వహించారు. కార్యక్రమంలో పీల వెంకట పరదేశినాయుడు, నగేష్, శ్రీను జెండా ఆవిష్కరించారు. పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా వందన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూర్యఅప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు సంఘం సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు. పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో జెండా వందనం కార్యక్రమం జరిగింది. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.జ్యోతి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కేవీఎస్ అప్పారావు, స్థానికులు పాల్గొన్నారు.

చిన్నారుల వేషధారణలు..

వెంకోజీపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలు, చిన్నారులు పలు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పోలీసు, రాణి రుద్రమదేవి, ఇందిరా గాంధీ తదితరు వేషధారణలో చిన్నారులు అలరించారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పెదజాలారి పేట, లాసన్స్‌బే కాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పతాకావిష్కరణ చేశారు. లాసన్స్ బే కాలనీ కామత్ వెనుక భాగంలో మొక్కలు నాటారు. ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో సంస్థ సీనియర్ సంచాలకులు గోని ధర్మారావు పతాకావిష్కరణ చేశారు. ఎంవీపీ రైతు బజార్‌లో ఈవో వరహాలు జెండా ఎగురవేశారు. మూలపాలెం, ముప్పలవానిపాలెం గ్రామం గోవా గార్డెన్‌లో వార్డు వైసీపీ అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ పతాకావిష్కరణ చేశారు. జీవీఎంసీ 19వ వార్డులోని మత్స్యకార పాఠశాలలో పేర్ల భాస్కరరావు అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో నెక్కంటి సీ ఫుడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలి సమీపంలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు కాలనీ రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎనిమిదో సెక్టరులో కిడ్స్ క్రియేట్ స్కూల్లో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జీవీఎంసీ 17వ వార్డులో గ్రామ సేవా సంఘం, గ్రామ మహిళా మండలి సంయుక్తంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంవీపీ ఆరో సెక్టరులో విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

బీజేపీ నగర కార్యాలయంలో..

పెదవాల్తేరు, ఆగస్టు 15 : నగర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీఎస్ ప్రకాష్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్.విజయానంద రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవకాంత తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని మొహమ్మదీయ మసీదు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని జెండా ఆవిష్కరించారు. చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీతల అమరేంద్ర, మసీదు పెద్దలు పాల్గొన్నారు. లాసన్స్ బే కాలనీ పార్కులో నిర్వహించిన వేడుకల్లో ప్రతాప్‌రుద్ర పతాకావిష్కరణ చేశారు.


ఎంవీపీ కాలనీ : మొక్కలు నాటుతున్న వెలగపూడి ప్రతాప్‌రుద్ర

కార్యక్రమంలో లాసన్స్‌బే పార్కు అధ్యక్షుడు దశరథరామయ్య, టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి పాల్గొని పార్కులో మొక్కలను నాటారు..

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

- ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా పథకం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వ్యక్తిత్వం వికసిస్తుందని ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ భవనంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక కార్పొరేట్ కాలేజీలు, ఇతర సంస్థలు నాయకత్వ శిక్షణకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయని, అయితే నిజమైన నాయకత్వం శిక్షణల వల్ల కాకుండా సమాజంలో జాతీయ సేవా పథకంలో భాగస్వాములు కావడంతో ద్వారా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ హరనాథ్ జాతీయ సేవా పథకం ప్రాధాన్య తను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.సింహాచలం, నోడల్ అధికారులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, తాతయ్యనాయుడు, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 22, బీరకాయలు 28, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

కేంద్ర కారాగారంలో జెండా పండుగ


కవాతు నిర్వహిస్తున్న జైలు సిబ్బంది

ఆరిలోవ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు శనివారం ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జైలు గార్డింగ్ సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకొంది. కేంద్ర కారాగారానికి సమీపంలో గల శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారు ప్రదర్శించిన పలు యోగా విన్యాసాలు అలరించాయి.విమ్స్ ఆస్పత్రిలో డైరెక్టర్ రాంబాబు పతాకావిష్కరణ చేశారు. పెదగదిలిలో గల మండల పరిషత్తు పాఠశాలలో హెచ్‌ఎం రవికాంత్ జెండా ఎగురవేశారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఆరిలోవ సీఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర వేడుకలు నిర్వహించారు. ఇందిరా గాంధీ జూపార్కులో జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆధ్వర్యం, పశు సంవర్ధకశాఖ కార్యాలయం, చినగదిలి మండల తహసీల్దార్ కార్యాలయం, ఆరిలోవ నేషనల్ హ్యూమన్ రైట్స్ రీజనల్ ఇన్‌చార్జి కనపక దుర్గ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం


వేడుకలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : 'జయ జనార్ధనా.. కృష్ణా రాధికా పతే.. జన విమోచనా.. కృష్ణా జన్మమోచనా గరుడవాహనా, కృష్ణా గోపికా పతే నయనమోహనా కృష్ణా నీరజేక్షణా..' అంటూ ఎంవీపీలో కృష్ణగానం మార్మోగింది. హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంతో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు మొదలయ్యాయి. మొదటి రోజు వేడుకలకు పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించన భక్త దాసుతో కలసి ఉత్సవాలను ప్రారంభించారు.

స్త్రీశక్తి అమలుతో మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం

» రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్
» వేడుకగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభం

మద్దిలపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకంతో మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించే స్త్రీశక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం వల్లన ఏడాదికి రూ.1947 కోట్లు ఖర్చు చేస్తూ ఇచ్చిన హామీని నెరవేర్చమన్నారు. దీనివల్ల మహిళలకు నెలకు రెండు, మూడు వేలు రూపాయలు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం ద్వారా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమలో విశాఖ ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు,దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు గండి బాబ్జీ, సీతారాం సుధాకర్ పాల్గొన్నారు.


స్త్రీశక్తి పథకం బస్సు ప్రారంభిస్తున్న మంత్రి సత్యప్రసాద్, పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎంపీ శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కెరటాల్లో చిక్కుకొన్న వ్యక్తిని రక్షించిన లైఫ్ గార్డులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో ఈతకు దిగిన నలుగురిలో ఒక వ్యక్తి కెరటాల్లో కొట్టుకుపోతుండగా, అతడిని లైఫ్ గార్డులు, వారి సిబ్బంది రక్షించి తీరానికి చేర్చడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన నలుగురు వ్యక్తులు లక్కీ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నారు. సెలవు దినం కావడంతో శుక్రవారం సాయంత్రం సముద్రం తీరంలో సరదాగా గడుపుదామని వచ్చి స్నానాలకు దిగారు. వీరిలో అశుతోష్ జూ (38) కెరటాల్లో కొట్టుకుపోతుండగా గమనించిన లైఫ్ గార్డులు అచ్చెన్న, నవీన్, కళ్యాణ్, మురళి ఈదుకుంటూ వెళ్లి అతడిని రక్షించారు.

కాలుష్య నివారణకు కృషి

విశాఖ పోర్టు ఛైర్మన్ ఎం.అంగముత్తు

ప్రభుత్వ రంగ సంస్థల్లో జెండా పండుగ

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో కాలుష్య నివారణకు కృషి చేస్తున్నట్టు విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పోర్టు కట్టుబడి ఉందన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో పోర్టు సరకు రవాణా చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ఉద్యోగులు, పోర్టు భాగస్వాములు, వాటాదారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పంపిణీ నష్టాల తగ్గింపులో దేశంలోనే అగ్రస్థానం : ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం : విద్యుత్ పంపిణీ నష్టాలను 5.8 శాతానికి తగ్గించామని, ఇది దేశంలోనే ఉత్తమ పనితీరుకు నిదర్శనమని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్పొరేట్ కార్యాలయంలో జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 73 లక్షల మందికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. పీఎం సూర్య ఘర్ కింద 19,385 ఇళ్లకు రూఫ్ టాప్ అమర్చామన్నారు. రూ.3,004 కోట్లతో గ్రామీణ ప్రాంతాలకు 24/7 విద్యుత్ కోసం కొత్త ఫీడర్లు ఏర్పాటు చేశామన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 97 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చంద్రం, టీవీ సూర్యప్రకాశ్, టి.వనజ, సీజీఎంలు పాల్గొన్నారు. దీని తరువాత పోలీస్ బ్యారెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సత్యప్రసాద్ చేతులు మీదుగా సీఎండీ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.


మంత్రి సత్యప్రసాద్ చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

కొత్తగా మరో యుద్ధనౌకలు

- ఈఎన్‌సీ చీఫ్ వైస్‌అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్

విశాఖపట్నం : తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. 50 మంది సాయుధ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆత్మ నిర్భర్ భారత్‌లో నౌకాదళం ముందు ఉందన్నారు. దేశీయంగా నౌకా నిర్మాణం జరుగుతున్నదని చెబుతూ ఇటీవల కమిషనింగ్ చేసిన నౌకలను ఉదహరించారు. త్వరలో మరో రెండు నౌకలు ఉదయగిరి, హిమగిరి తూర్పు నౌకాదళంలోకి రానున్నాయని వెల్లడించారు. వచ్చే ఏడాది విశాఖపట్నంలో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌లకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన నేవీ కుటుంబాలతో ముచ్చటించారు.


జిల్లా టీడీపీ కార్యాలయం ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీ శ్రీభరత్, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు


సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు


జనసేన కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఎందరో మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

» స్వాతంత్ర్య వేడుకల్లో ప్రముఖుల సందేశం

విశాఖపట్నం/మహారాణిపేట/సీతమ్మధార/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/కంచరపాలెం/మురళీనగర్/మద్రిపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పలువురు ప్రముఖులు జాతీయ పతాకాలను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మహనీయుల త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలని పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. త్యాగధనుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పొలమరశెట్టి శ్రీనివాసరావు, లొడగల కృష్ణ, గొలగాని వీరారావు, సారిపల్లి మహేష్ పాల్గొన్నారు. పాత జైలురోడ్డులోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల, సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జాతీయ పతాకాలు ఎగురవేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జాతీయ జెండాకు వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఉపసంచాలకుని కార్యాలయంలో డీడీ కె.సదారావు, డాబాగార్డెన్స్ సూర్యాబాగ్‌లోని పాపా హోమ్‌లో డీసీపీ అజిత త్రివర్ణ పతాకాలు ఎగురవేశారు. పలు ప్రాంతాల్లో జరిగిన పతాక సంబరాల్లో డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు కందుల నాగరాజు, బీశెట్టి వసంత లక్ష్మి, కోడిగుడ్ల పూర్ణిమ, ముక్కా శ్రావణి, గంకల కవిత, రెయ్యి వెంకటరమణ, హనోక్, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, జోనల్ కమిషనర్ బి.రాము, ప్రభుత్వ ఐటీఐలో ఆర్డీడీ ఆర్.వి.రమణ, పాలిటెక్నిక్ కళాశాల్లో డా.కె.వి.రమణ, జీవీవీ సత్యనారాయణ మూర్తి, ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల జెండా వందనం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, పోలీసు స్టేషన్లు, అనేక సంస్థల కార్యాలయాల వద్ద మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జీవీఎంసీ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. సంబరాల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ వేషధారణలతో వచ్చిన విద్యార్థులు ఆహూతులను ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ సాధించినవారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో జరిగిన వేడుకల్లో కమిటీ ప్రెసిడెంట్ ఎస్.వరప్రసాద్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ

మహారాణిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్‌వో భవానీ శంకర్ ఏవో రాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.80 లక్షలతో నిర్మించిన కలెక్టరేట్ ముఖద్వారాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు.


జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

లక్ష్యాన్ని అధిగమించే దిశగా వాల్తేరు రైల్వే: డీఆర్‌ఎం

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని అధిగమించే దిశగా వాల్తేరు డివిజన్ ముందుకు సాగుతోందని వాల్తేరు రైల్వే డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. శుక్రవారం రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. రైల్వే రక్షణ దళం కవాతును తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలో అత్యధిక లోడింగ్ చేస్తున్న తొలి ఐదు డివిజన్లలో వాల్తేరు నిలవడం విశేషమన్నారు. ఈ ఏడాది జూలై నాటికి రూ.3,600 కోట్ల ఆదాయార్జనతో 14 శాతం పురోగతి సాధించిందన్నారు. సరుకు రవాణా 16 శాతం, ప్రయాణికుల ద్వారా 2 శాతం ఆదాయార్జన పెరిగిందన్నారు. బొగ్గు, ఇనుప ఖనిజం, పిగ్ ఐరన్, ఫినిష్డ్ స్టీల్, ఎరువులు, మినరల్ ఆయిల్స్ రవాణాలో సరికొత్త రికార్డులు నెలకొల్పామన్నారు. విశాఖలోని విద్యుత్ లోకోషెడ్‌కు జాతీయ గుర్తింపు రావడం డివిజన్‌కు గర్వకారణమన్నారు. ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించి, వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామన్నారు. రైల్వే రక్షణ దళం, అధికారులు, ఉద్యోగుల అవిశ్రాంత కృషి, అద్భుతమైన పనితీరుతో ఈ డివిజన్ లక్ష్యాలను అధిగమిస్తోందని డీఆర్‌ఎం పేర్కొన్నారు.


ప్రసంగిస్తున్న వాల్తేరు రైల్వే డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

సీసీఎస్ చంద్రశేఖర్‌కు ఇండియన్ ప్రెసిడెన్సీ మెడల్


చంద్రశేఖర్‌కు శాలువాతో సత్కరించిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్, సీపీ తదితరులు

మహారాణిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఏఎస్‌ఐ పెదిరెడ్డి చంద్రశేఖర్‌ను ఇండియన్ ప్రెసిడెన్సీ మెడల్ వరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది పోలీసు అధికారులకు ఈ మెడల్స్ ప్రకటించగా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి చంద్రశేఖర్ ఒక్కరే ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రెసిడెన్సీ మెడల్ ఇస్తారు. చంద్రశేఖర్‌కు మెడల్ బహూకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ శాలువాతో సత్కరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిలు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. సహచర పోలీసు అధికారులు, సిబ్బంది చంద్రశేఖర్‌ను అభినందనలతో ముంచెత్తారు. 1984 బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్ ట్రాఫిక్, క్రైమ్, శాంతిభద్రతల విభాగాల్లో పనిచేసి అందరి మన్ననలు పొందారు.

ఈపీడీసీఎల్ ఈఈకి రూ.20 వేల నగదు బహుమతి

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో విధులు నిర్వహించి, లక్ష్యాలు పూర్తి చేసినందుకు జోన్-1 ఈఈ పోలాకి శ్రీనివాసరావుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శుక్రవారం రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే ఉత్తమ సేవలు అందించినందుకు పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.


సీఎండీ నుంచి నగదు బహుమతి అందుకుంటున్న ఈఈ పోలాకి శ్రీనివాసరావు

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గోలి రామకృష్ణ, డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్, కె.సదాశివరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేస్తున్న బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తదితరులు

కన్నుల పండువగా దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు


దివ్యబలిపూజలో ఓ ఘట్టం

జ్ఞానాపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలో శుక్రవారం దేవమాత మోక్షారోపణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 6.30 గంటల సమయంలో గుహ వద్ద దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల జాతీయ జెండాను ఎగురవేశారు. ఉత్సవాన్ని తిలకించడానికి అనేకమంది విశ్వాసులు పునీతపేతురు దేవాలయానికి చేరుకుని ప్రార్థనలు చేశారు. వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, డాక్టర్ మల్లవరపు ప్రకాశ్, డి.పరంజ్యోతి, బోగి సంజీవి, లాము జయరాజు, ఎస్.విమల్‌రాజ్, వై.ప్రేమ్‌కుమార్, అతిథులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి

» వైద్యాధికారులకు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు సూచన

సీతమ్మధార, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు శుక్రవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు పరిశీలించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఒకటో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ సెక్రటరీ ఆర్ఎస్ నాయుడు, న్యాయశాఖ సిబ్బంది, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.


కోర్టు ప్రాంగణంలో ప్రారంభించిన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు తదితరులు

ఘనంగా శ్రావణ లక్ష్మి పూజలు


కనకమహాలక్ష్మి ఆలయంలో హోమ పూజలు

మహారాణిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీపూజ ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య అమ్మవారికి ప్రత్యేక క్షీరాభిషేకం, హోమంతో విశేష పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, పండ్ల రసాలు తదితర 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి 108 బంగారు పుష్పాలతో నివేదన చేశారు.

ఉమాదేవి అమ్మవారికి గాజులతో అలంకరణ



డాబాగార్డెన్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయ ప్రాంగణంలో ఉన్న ఉమాదేవి అమ్మవారిని శ్రావణమాసం 4వ శుక్రవారం సందర్భంగా గాజులతో అలంకరించారు. ఆలయ అర్చకుడు జి.భార్గవశర్మ సంప్రదాయరీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సన్నిధిలో మహిళలు దీపారాధన చేసి సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాబాయి, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, గోపి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందరికీ అర్చన చేసిన కుంకుమతీర్థ ప్రసాదాలు అందజేశారు.

'ఘంటసాల ది గ్రేట్' చిత్ర ప్రదర్శన రేపు

డాబాగార్డెన్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా మాజీ పోలీసు అధికారి సీహెచ్ రామారావు తెరకెక్కించిన 'ఘంటసాల ది గ్రేట్' ప్రీవ్యూ షో ఈ నెల 17న ఉదయం 8 గంటలకు రామాటాకీస్‌లో ఏర్పాటు చేశారని, దీన్ని ప్రతీ ఒక్కరూ చూడాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఘంటసాల స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, విశాఖ గాయనీగాయకుల సంఘం అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో రోలర్ స్కేటింగ్ పోటీలు

మాధవధార, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ స్పోర్ట్సు పార్కులో శుక్రవారం ఆరు గంటల నిర్విరామ రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన శివగంగ రోలర్ స్కేటింగ్ క్లబ్ నిర్వహణలో పోటీలు జరిగాయి. కోచ్ సంతోష్, లలిత ప్రియ, అనీల్‌కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ ఆరు గంటలు జరిగే పోటీల్ని వరల్డ్ రికార్డ్ మార్షిన్ పోటీలుగా పిలుస్తారని పేర్కొన్నారు. 44 మంది స్కేటింగ్ క్రీడాకారులు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం ప్రతిభ చాటనున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆరంభమైన పోటీల్లో వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కార్యదర్శి సూర్యనారాయణరాజు, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

7.3 లక్షల మంది మహిళలకు ఉచిత సిలిండర్లు అందించడం కోసం రూ. 59.32 కోట్లు జమ చేశామన్నారు.

పేద పిల్లల చదువు కోసం తల్లికి వందనం పేరిట జిల్లాలో 2,30,496 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.299 కోట్లు జమ చేశామని మంత్రి తెలిపారు. 776 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద 18 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.12.9 కోట్లు జమ చేశామన్నారు. చేపల వేట నిషేధ కాలంలో భృతి కింద 12,138 మంది మత్స్యకారులకు రూ.20 వేల వంతున చెల్లించామన్నారు. జిల్లాలో 4,604 హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాల కింద రూ.38 లక్షలు కేటాయించామన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి 25,063 కుటుంబాలలో 34,075 మందికి 12 లక్షల పనిదినాలు కల్పించి రూ.33.14 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. విశాఖ పోర్టు సాయంతో పొలం గట్లు, చెరువు గట్లపై 12,946 మొక్కలు నాటడం జరిగిందన్నారు. వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్ అమలు కోసం భీమిలి-నర్సీపట్నం రోడ్‌కు సంబంధించి జిల్లా పరిధిలో విస్తరణకు రూ.34 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఇంతవరకు 90,748 మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలకు రూ.158.49 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనకు 2.44 లక్షల కుటుంబాల్లో 9.11 లక్షల మంది అర్హత పొందారన్నారు.

జీవీఎంసీ పరిధిలో రూ.1,405 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు వివిధ పనులు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అమృత్ 2.0లో భాగంగా మంచినీటి సరఫరా మెరుగుకు రూ.360.77 కోట్లతో 27 ప్రాజెక్టులు చేపట్టగా ఇప్పటివరకూ ఐదు పూర్తయ్యాయన్నారు. నగరంలో 1.18 లక్షల ఎల్‌ఈడీ వీధిదీపాలు ఉండగా కొత్తగా 10,805 దీపాల ఏర్పాటుకు రూ.6.52 కోట్లు వెచ్చించామన్నారు. నగరంలో 740 ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసేందుకు రూ.56 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. 25 అన్న క్యాంటీన్లలో రూ.3.33 కోట్లు వెచ్చించి 64 లక్షల మందికి భోజనం అందించామన్నారు. వీఎంఆర్డీఏ ద్వారా రూ.17.73 కోట్లతో పెందుర్తిలో రెండు కన్వెన్షన్ సెంటర్లు, సిరిపురంలో రూ.87.5 కోట్లతో మల్టీలెవెల్ పార్కింగ్, రూ.3.49 కోట్లతో వాణిజ్య సముదాయాలు నిర్మించామన్నారు. కైలాసగిరిపై జిప్ లైనర్, స్కై సైక్లింగ్, గ్లాస్ బ్రిడ్జి ఇతర ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఎకో హైట్స్ కాటేజెస్, రివాల్వింగ్ రెస్టారెంట్, ఇతర ప్రాజెక్టుల పనులు రూ.20 కోట్లతో జరుగుతున్నాయన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కులో రూ.7.8 కోట్లతో అల్లూరి సీతారామరాజు సెంటినరీ మెమోరియల్ మాన్యుమెంట్ బీచ్ డెక్ రూపొందించనున్నామన్నారు.

జిల్లాలో పేదల కోసం 1.39 లక్షల ఇళ్లు మంజూరుచేయగా, ఇప్పటివరకూ 49 వేల ఇళ్లు పూర్తిచేశామన్నారు. సీఎం సూర్యఘర్ కింద 2,460 సోలార్ రూఫ్‌టాప్ ప్యానళ్ల పనులు పూర్తిచేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. రూ.16,219 కోట్ల పెట్టుబడులతో మూడు భారీ పరిశ్రమల ఏర్పాటు చేయడం ద్వారా 34,120 మందికి, రూ.244 కోట్లతో 7,371 చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించడం ద్వారా 13,637 మందికి ఉపాధి కలిగిందన్నారు. 54 జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా 4,734 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇంకా తొమ్మిది స్కిల్ హబ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, దీంట్లో 562 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. మూడు లక్షల మందితో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో నమోదుకావడం జిల్లాకు గర్వకారణమన్నారు.

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు త్వరలో పట్టాలెక్కనున్నదని, దీనిలో భాగంగా తొలిదశ పనులు త్వరలో చేపడతామని మంత్రి ప్రకటించారు. మొదటి దశ టెండర్లు ఇప్పటికే పిలిచామని, మూడు కారిడార్లలో 76.9 కిలోమీటర్లకు డీపీఆర్ రూపొందించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చొరవతో విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం రూ.11,440 కోట్లు కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. విభజన హామీలలో భాగంగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటైందన్నారు. జోన్ కార్యాలయం పనులు ప్రారంభమయ్యాయన్నారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకు ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చామన్నారు. భూముల రీసర్వే పనులు 2027 డిసెంబరుకు పూర్తిచేస్తామన్నారు. అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి తప్పులను నిగ్గు తేల్చామన్నారు. వచ్చే ఏడాది జూన్‌కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్నదని మంత్రి ప్రకటించారు. జిల్లాను అభివృద్ధిపథం దిశగా నడిపించేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు, న్యాయాధికారులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

లబ్ధిదారులకు రూ. 214.99 కోట్ల ప్రోత్సాహకాలు అందజేత

గృహ నిర్మాణ శాఖ శకటానికి ప్రథమ, జీవీఎంసీ శకటానికి ద్వితీయ, విద్యా, సమగ్రశిక్షా శకటానికి తృతీయ బహుమతి, ఈపీడీసీఎల్ శకటానికి ప్రోత్సాహక బహుమతి లభించాయి. మైదానంలో పలు శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను మంత్రి, ఇతర అధికారులు సందర్శించారు. వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు రూ.214.99 కోట్ల ప్రోత్సాహకాలను మంత్రి అందజేశారు. సేక్రేడ్ హార్ట్, విశాఖ వ్యాలీ, పద్మనాభం కేజీబీవీ, నడుపూరు, పెందుర్తి జడ్పీ పాఠశాలల విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఏపీ ఆయిల్ సీడ్స్ కో-పరేటివ్ గ్రోయర్స్ ఛైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీసీపీలు అనిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హ్యాపీ జర్నీ


స్త్రీశక్తి బస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాస్ తదితరులు

... 5వ పేజీ తరువాయి

ప్రయాణం వల్ల మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఇదో వినూత్న పథకమని, దీనిని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని మహిళలు బాగా గుర్తు పెట్టుకోవాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడుతున్నా కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నదని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా పేర్కొన్నారు. ఈ పథకం మహిళల అభివృద్ధికి దోహదపడుతుందని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు.

మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆయన మధురవాడ ఆర్టీసీ డిపోలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి మహిళలతో కలిసి కొంతదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే మహిళలు, గృహిణులకు ఈ పథకం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలన్నీ మొదటి ఏడాదిలోనే నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

గోపాలపట్నంలో...

పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు స్త్రీశక్తి పథకాన్ని గోపాలపట్నంలో ప్రారంభించారు. మహిళలతో కలిసి గాజువాక మీదుగా ములగాడ వరకు ప్రయాణించారు. బస్సులో మహిళలతో ముచ్చటిస్తూ వారి కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

పెందుర్తిలో...

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తి బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెందుర్తి ప్రాంతం నుంచి వివిధ పనులపై నగరంలోకి వెళ్లే మహిళలకు ఈ పథకం బాగా ఉపకరిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. బాణాసంచా కాల్చి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

పంద్రాగస్టు వేడుక


బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ


రెండో బహుమతి గెలుచుకున్న జీవీఎంసీ శకటం


మూడో స్థానంలో నిలిచిన విద్యాశాఖ శకటం


సాంస్కృతిక ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు


జాతీయ జెండాలతో అభిమాని ప్రదర్శన


వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్


హాజరైన ఎంపీ శ్రీభరత్, మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు


ఎస్‌హెచ్‌జీ మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి



ఉత్తమ సేవలకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీఆర్వో భవానీ శంకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, బీసీ సంక్షేమాధికారి రామారావు, డీఎస్వో వి.భాస్కరరావు, సమగ్ర శిక్ష ఏపీడీ చంద్రశేఖరరావు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీత, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, భీమిలి ఆర్డీవో సంగీత్‌మాథుర్, ఎస్‌డీసీలు సుధాసాగర్, శేషశైలజ, జోన్ 2 జెడ్సీ కనకమహాలక్ష్మి, 108 జిల్లా మేనేజర్ సురేశ్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్స్ ప్రతినిధి వర్మ, కలెక్టరేట్ ప్రొటో కాల్ విభాగం డీటీ సుధాకర్ (కుడి నుంచి ఎడమకు)

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెందుర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నటరాజ్ సినిమా హాలు వెనుక ఉన్న బావిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. వ్యవసాయ బావిలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు శుక్రవారం సమాచారం ఇచ్చారు. పోలీసులు తాళ్లతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు విజయనగరం జిల్లా జామి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన రావూరి ప్రసాద్ (40)గా గుర్తించారు.అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రసాద్ మద్యానికి బానిస కావడంతో భార్య వేరుగా ఉంటోంది. అతను విశాఖలోని మాధవధార వద్ద ఉన్న తన సోదరి ఇంట్లో ఉంటూ ప్లంబింగ్ పనికి వెళుతున్నాడు. సోమవారం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరలేదు. కుటుంబీకులు ఆచూకీ కోసం గాలిస్తుండగా బావిలో శవమై ప్రత్యక్షమయ్యాడు, మద్యం సేవించి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడా లేదా ఇతర కారణాలు ఉన్నాయా అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు ప్రోత్సాహకాలు

పెందుర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు.మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 12 వేలు చొప్పున అందించారు. నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రూ. 10 వేలు చొప్పున ఇచ్చారు.

సినిమా గైడ్

● **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **కింగ్డమ్** : జగదాంబ
● **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
● **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
● **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 22, బీరకాయలు 28, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ(పె)10, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ(పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, గోరు చిక్కుడు 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొం డ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట)4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిదగుమ్మడికా య 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం


గోపాలపట్నంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు


పెందుర్తిలో పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

గోపాలపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నంలోని అన్ని ప్రాంతాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్‌లో డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గణబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాత గోపాలపట్నంలో జరిగిన వేడుకల్లో జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలతో పాటు కార్మిక సంఘాలు కూడా వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పెందుర్తిలో...

పెందుర్తి : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, తహశీల్దార్ వెంకట అప్పారావు, ఎంపీడీవో గుండాల అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ అయిత సింహాచలం, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, సేనాపతి సోమశేఖర్ పాల్గొన్నారు. 97వ వార్డులోని చినముషిడివాడ శాంతినగర్ పాఠశాల, సుజాతనగర్ కాలనీలో జరిగిన వేడుకల్లో జీవీఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ సేనాపతి వసంత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గౌరీ సంఘ భవన్‌లో ఆ సంఘ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. చినముషిడివాడ రైల్వే విహార్ కాలనీలో వుడా రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట రాము, రాంపురంలో సాధన పబ్లిక్ స్కూల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు,

పారిశ్రామిక ప్రాంతంలో...

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్ : పారిశ్రామిక ప్రాంతంలో స్వాతంత్ర్య దినోత్సవం వైభవంగా నిర్వహించారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ శ్రీనివాసరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, జోనల్ కార్యాలయంలో జడ్సీ శేషాద్రి, గాజువాక బీజేపీ కార్యాలయంలో మాజీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, ఇస్లాంపేట ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు, స్టీల్‌క్లబ్‌లో ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్) ఎం. మధుసూధన్‌రావు, కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, స్టీల్‌ప్లాంట్ డీపీఎస్‌లో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, చైతన్య స్కూల్‌లో ఈడి మేఘన కంభం, ఇంటక్ కార్యాలయంలో మంత్రి రాజశేఖర్ పతాకా విష్కరణ చేశారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 69వ వార్డులో తుంగ్లాం, నాతయ్యపాలెం, చుక్కవానిపాలెం కాలనీలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పతాకావిష్కరణ చేశారు. 68వ వార్డులోని హైస్కూల్, పంచవటి కాలనీ, మింది కాలనీలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ గుడివాడ అనూష జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మింది గ్రంథాలయం వద్ద జరిగిన వేడుకల్లో ప్రభుత్వ హోమియో వైద్యాధికారి శ్రీదేవి, భెల్ హెచ్‌పీవీపీ క్రీడామైదానంలో జరిగిన వేడుకల్లో సీనియర్ కార్మికుడు కృష్ణకాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్ : స్థానిక యాపిల్ హైస్కూల్, టీఎస్సార్ టీబీకే కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. రామకృష్ణరావు, టీడీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ పతాకావిష్కరణ చేశారు. 86వ వార్డులో డీసీబీ చైర్మన్ కోనతాతారావు పతాకావిష్కరణ నిర్వహించారు. 87వ వార్డులో, కణితి హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పతాకావిష్కరణ చేశారు. 70వ వార్డులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో బీజేపీ నగర కార్యదర్శి దేనంకొండ కృష్ణంరాజు పతాకావిష్కరణ చేశారు.


తూర్పు నౌకాదళంలో సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 79వ వార్డులోని వీఎస్ఈజెడ్ ఆవరణలో వీఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. దువ్వాడ సినర్జీస్ కర్మాగారంలో జాహ్నవి మొవ్వా, ఐలా కార్యాలయంలో వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ఐలా కమిషనర్ అయినవిల్లి కిశోర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు కె.మల్లేశ్వరరావు, కె.వెంకట్రావు పతాకా విష్కరణ చేశారు.

అగనంపూడిలో...

అగనంపూడి : ప్రాంతీయ ఆస్పత్రిలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్ ఇల్లపు వరలక్ష్మి పతాకావిష్కరణ చేశారు.

పెదగంట్యాడ...

పెదగంట్యాడ : పెదగంట్యాడలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాధికారి కార్యాలయంలో ఎంఈఓ రమణాజీ పతాకావిష్కరణ చేశారు. పోతిన సన్యాసిరావు భవన్ ఆవరణలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, 72వ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్ పతాకావిష్కరణ చేశారు. 76వ వార్డులో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు. 65వ వార్డులో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పతాకావిష్కరణ చేశారు.

వంద జాతీయ జెండాతో ర్యాలీ..

ఎన్ఏడీ జంక్షన్/ వేపగుంట : బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం వరకు జనసేన ఆధ్వర్యంలో వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఎ. ప్రసాద్, జనసేన నాయకులు బెహరా భాస్కరరావు, సంగం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు. కాకానీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య సింహ, పాల్గొని జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, తదితరులు పాల్గొన్నారు. వేపగుంట జోనల్ కార్యాలయంలో జెడ్సీ హైమావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ మూర్తి, ఏఎంహెచ్ఓ డాక్టర్ బండారు అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ రమణ, డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈడీ చిరంజీవి పాల్గొన్నారు. 93, 94 వార్డుల పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు జెండా వందనం చేశారు

మల్కాపురంలో...

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో స్వాతంత్ర్య దినోత్సవం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ములగాడ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు. వార్డులో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ సురేష్, పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, గల్లా పోలిపిల్లి (చిన్న) జాతీయ జెండాను ఆవిష్కరించారు. మల్కాపురం పోలీసు స్టేషన్‌లో సీఐ గొలగాని అప్పారావు, షిప్‌యార్డులో సీఎండీ గిరిదీప్ సింగ్, హెచ్‌పీసీఎల్‌లో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆర్, రామకృష్ణనన్, కోరమాండల్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్ (మ్యాన్ ఫాక్చరింగ్ విభాగం) సీహెచ్ శ్రీనివాసరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విశాఖపట్నం లారీ అపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు ఎగ్జామ్ పార్కు ఏరియాలో నిర్వహించిన వేడుకల్లో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వి. జయప్రకాశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల్లోనూ వేడుకలు జరిగాయి. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు, 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, 63వ వార్డులో కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) పతాకావిష్కరణ చేశారు.

కాలుష్య నివారణకు కృషి

విశాఖపట్నం : విశాఖలో కాలుష్య నివారణకు కృషి చేస్తున్నట్టు విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పోర్టు కట్టుబడి ఉందన్నారు. అలాగే తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. సాయుధ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆత్మ నిర్భర్ భారత్‌లో నౌకాదళం ముందు ఉందన్నారు. దేశీయంగా నౌకా నిర్మాణం జరుగుతున్నదని చెబుతూ ఇటీవల కమిషనింగ్ చేసిన నౌకలను ఉదహరించారు. త్వరలో మరో రెండు నౌకలు తూర్పు నౌకాదళంలోకి రానున్నాయని వెల్లడించారు.


గోపాలపట్నంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు


పెందుర్తిలో మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పండగలా స్త్రీశక్తి ప్రారంభోత్సవం

మల్కాపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గాజువాక డిపో వద్ద స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవం పండగ వాతావరణంలో సాగింది.ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందన్నారు. పథకం అమలు వల్ల ప్రభుత్వానికి భారమే అయినప్పటికీ మహిళ లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. డిపో నుంచి మూడు బస్సుల్లో మహిళలు తొలిరోజు ప్రయాణం చేశారు. గాజువాక ఆర్టీసీ డిపో నుంచి సింధియా వరకు, అలాగే గోపాలపట్నం వరకు బస్సులను తిప్పారు. ఈ కార్యక్రమంలో జనసేనా మహిళా నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి, బీజేపీ నాయకురాలు నాదెండ్ల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన గోపాలపట్నంలో ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం బీఆర్‌టీఎస్ బస్టాపు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రణాళికాబద్ధంగా నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఆయన గోపాలపట్నం నుంచి మల్కాపురం వరకూ మహిళలతో పాటు బస్సులో ప్రయాణించారు.

పెందుర్తి : పెందుర్తి ఆర్‌టీసీ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించారు. మహిళలతో కలిసి పెందుర్తి నుంచి కొంతదూరం వరకు బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులతో మాట్లాడి ఉచిత బస్సు విధి విధానాలను వివరించారు. గుర్తింపు కార్డు ఉంటే రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చునన్నారు, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, పెంటకోట రాజేంద్రప్రసాద్, పిన్నింటి పార్వతి, దాసరి జయలక్ష్మి, లక్కీ గోవింద్, బయిలపూడి హరగోపాల్ పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : మహిళలకు ఉచిత బస్సు పథకం ఒక వరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలో శుక్రవారం సాయంత్రం ఆయన ఉచిత బస్సును ప్రారంభించి, మహిళలతో పాటు ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం విధి విధానాలను వివరించారు. కాగా మహిళలు ఉచిత బస్సుకు మంగళ హారతులు, నీరాజనాలతో ఘన స్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్.. డిప్యూటీ సీఎం సార్...అంటూ నినాదాలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు విజయ రామరాజు, లక్కరాజు సోంబాబు, సిరసపల్లి కనకరాజు, సూరిశెట్టి పెంటారావు, రాజన్ రాజు, జి. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పెదగంట్యాడ : స్త్రీశక్తి పథకాన్ని టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు నడుపూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం వల్ల మహిళలకు కొంతమేర ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చునని చెప్పారు.

ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతుంది



స్త్రీశక్తి పథకం వల్ల కూటమి ప్రభుత్వం పట్ల మహిళల్లో ఆదరణ పెరుగుతుంది. దీపం పథకం, తల్లికి వందనం, పించన్లు పెంపు, రోడ్ల నిర్మాణం, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణాలు ఇలా.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల స్త్రీలు ఆధ్యాత్మిక పర్యటనలకు వీలు కలుగుతుంది.

జి. రామ తులసి, కణితి

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న ఈ నిర్ణయం చాలా సంతోషం కలిగించింది. కూటమి పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో కూడా న్యాయం జరుగుతుంది.ఉచిత బస్సు చాలా మంది మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

నెల్లూరు శారద, శాంతిగిరి కాలనీ

ఆర్థిక భారం తగ్గుతుంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల చిరు ఉద్యోగులకు కొంతవ రకూ ఆర్థిక ఇబ్బందులు తగ్గు తాయి. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం చాలా సంతోషం కలిగిస్తోంది.

తెప్పల దుర్గా సావిత్రి , శ్రీహరిపురం


మల్కాపురంలో కార్యక్రమానికి హాజరైన మహిళలు